క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్లు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు గురువారం క్లాస్ టీచర్ కరుణాకర్ హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షల్లో బాలురు, బాలికలు మొత్తం 224 మంది హాజరవుతున్నారు.

పరీక్షా కిట్ల పంపిణీ

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం ఎగ్జామ్స్ కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు రాజాంరాజు దాతృత్వంతో అందించిన ఎగ్జామ్ ప్యాడ్, పెన్, స్కేల్, పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్ కలిగి ఉన్న కిట్లను కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు విద్యార్థులు బాగా రాసి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని హేమలత, ఉపాధ్యాయులు, 50వ వార్డు నాయకులు పైడి కృష్ణారావు మాస్టరు, అమర్‌రెడ్డి, సబ్బవరపు శ్రీను, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతంపేట: అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ ఎయిడెడ్ పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథులు సీతమ్మధార మండల ఎంఈవో డి.రామారావు, ఎంఈవో అమృత బాలామణి ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు తమ పాఠ్యాంశాలలోని విషయాలపై నమూనాలు తయారు చేసి ప్రదర్శలో ఉంచారు. కేఎస్ఎం, మధురానగర్, వాగ్దేవి స్కూల్ విద్యార్థులు కూడా పాల్గొని నమూనాలు ప్రదర్శించారు. పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రదర్శన తిలకించారు. పాఠశాల కరస్పాండెంట్ సునీత కుమారి పర్యవేక్షించారు.

26వ వార్డులో పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం రామకృష్ణానగర్ చాకలిపేటలో రూ.16.30 లక్షలతో నూతనంగా నిర్మించిన పార్కును గురువారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 574 గజాల స్థలంలో వాకింగ్ ట్రాక్, కూర్చోడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పార్కులో గ్రీనరీ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆయన సూచించారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, కార్పొరేటర్ శ్రావణి, కిషోర్, బొడ్డేటి కిరణ్, రేవతిరావు, శేషు, రవిబాబు, పాండవ శ్రీను, పి.రాము, అమ్మాజి, నవాబ్, చై.చిన్న, రమాదేవి, సుశీల, గౌశ్య, గుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్‌లో నూతన సామాజిక భవనం



వైఎస్సార్ నగర్‌లో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు


తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి వైఎస్సార్ నగర్‌లో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని గురువారం కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకుతో కలిసి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ప్రారంభించారు. వార్డులో ప్రారంభించబోయే సుమారు రూ.3.91 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, రాజుయాదవ్, నాయుడు, సన్ని, దుర్గ, గణపతి, సత్యానందం రెడ్డి, మాత ఈశ్వరరావు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కల.. నిజమైన వేళ

- సీఎం జగన్ పాలనలో సాకారం
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 6 వార్డులకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ



44వ వార్డులో లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ పట్టా అందజేస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్ ఉషశ్రీ



14వ వార్డులో పట్టా అందజేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతంపేట: ప్రతి అక్కచెల్లెమ్మ సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండలాధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం శ్రీనివాసనగర్ దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో 44వ వార్డు లబ్ధిదారులకు వన్ సెంట్ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ జరిగింది. 43వ వార్డు వెంకటేశ్వర కాలనీ సామాజిక భవనంలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ అధ్యక్షతన రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా కె.కె.రాజు మహిళలకు పట్టాలు అందజేసి మాట్లాడారు. గతంలో ఇచ్చిన పట్టాలకు శాశ్వత హక్కు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించి పూర్తి హక్కు కల్పిస్తూ సేల్ డీడ్స్ అందిస్తున్నట్టు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హత ఉండి ఇంటి స్థలం రాని వాళ్లు దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో మంజూరవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరో సారి గెలిపించాలని కె.కె.రాజు కోరారు. బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ 44వ వార్డులో 1,236 మందికి పట్టాలు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, హబీబ్, బాణాల తరుణ్, ఏపీడీ పద్మావతి, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

14వ వార్డులో..

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులో లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు.

42, 45 వార్డుల్లో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులోని లబ్ధిదారులకు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వే న్యూకాలనీలోని వార్డు కార్యాలయం వద్ద జగనన్న ఇళ్లు రిజిస్ట్రేషన్ పత్రాలను వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

- 45వ వార్డులోని లబ్ధిదారులకు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెం వద్ద ఇళ్లు రిజిస్ట్రేషన్ పత్రాలను కె.కె.రాజు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, కారుకొండ రాజు, సత్యానందం రెడ్డి, దుర్గ, నాయుడు, సన్యాసప్పలనాయుడు, జీవీఎంసీ డీఈ భరణి, ఏఈ, సీవో, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

46వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్ సచివాలయంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. పేదోడి సొంతింటి కల.. జగనన్నతో సాకారమవుతోందన్నారు. కార్యక్రమంలో సేవాపతి అప్పారావు, గోవింద్, చిన్నా, దూది నర్సింగరావు, రామారావు, రమణ తదతరులు పాల్గొన్నారు.



42వ వార్డులో ఇంటి పట్టా అందుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారు



46వ వార్డులో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్

గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలి



మహిళలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని ఉత్తర నియోజకవర్గ మహిళల ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం హైవే జంక్షన్ నుంచి మహారాణి పార్లర్ కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పాల్గొని మాట్లాడుతూ టీడీపీ, జనసేనల కుట్రపూరిత రాజకీయాలు నశించాలన్నారు. కేవలం ఇళ్ల పట్టా వచ్చిందన్న సంతోషం పంచుకోవడమే గీతాంజలి చేసిన తప్పా.. అని ప్రశ్నించారు. నారా లోకేష్ రాబందులైన టీడీపీ, జనసేన సైన్యంతో సోషల్ మీడియాలో నీచంగా పోస్టులు పెట్టి ఆమెను వేధించారన్నారు. గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ఇటువంటి కుటిల రాజకీయాలకు పాల్పడుతున్న టీడీపీ, జనసేనలకు రానున్న ఎన్నికల్లో మహిళలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్లు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఆస్పత్రి సిబ్బంది

సీతంపేట: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వం చేరువ చేసిందని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. టి.బి. ఆస్పత్రి సిబ్బంది గురువారం సీతంపేటలో నిర్వహించిన జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన ర్యాలీని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు అత్యాధునిక వైద్య చికిత్స అందుబాటులో ఉందని, ప్రభుత్వ టి.బి. హాస్పిటల్‌లో ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు ఇస్తున్నారని చెప్పారు. వైద్య సిబ్బంది ప్రజలకు కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు ఉదయశ్రీ, మన్మోహన్, హెచ్‌వీ సునీత, ఎస్‌డీఎస్ సత్యనారాయణ, డీపీసీ శ్రీనివాస్, డీపీఎస్ లోకేష్, మధు, పరమేష్, శ్రీదేవి, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలు. ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్సిడీ కోసం సర్వే

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లోని టిడ్కో గృహ సముదాయంలో నివసిస్తున్న వారి ఇళ్లను గురువారం ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ సందర్శించారు. ఈ ప్రాంతంలో అధికంగా నివసిస్తున్న చెంచు సామాజిక వర్గానికి చెందిన వారితో ఆయన మాట్లాడారు. వీరికి ఎస్సీ, ఎస్టీలకు అందజేసే విద్యుత్ సబ్సిడీ కోసం అవసరమైన కుల ధ్రువపత్రాలను, ఆధార్ కార్డ్ కాపీలను సెక్షన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దీని ద్వారా వీరందరికి ఈ పథకం వర్తిస్తుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ వి.ఎ.విద్యాసాగర్, ఏఈ జి.హరగోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా బలగాల కవాతు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో కవాతు చేస్తున్న ఈస్ట్ ఏసీపీ జయరాంప్రసాద్, సీఐఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. తమిళ కల్యాణ మండపం, రాధాకృష్ణా లేఅవుట్, గణేష్‌నగర్, సింహగిరి కాలనీ, సత్యసాయినగర్, సాలిగ్రామపురం, కైలాసపురం, తాటిచెట్లపాలెం, 80 అడుగుల రోడ్డు మీదుగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈస్ట్ ఏసీపీ మెహర్ జయరాం ప్రసాద్ నేతృత్వంలో సివిల్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు సంయుక్తంగా కవాతు చేపట్టాయి. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ నిమిత్తం సీఐఎస్ఎఫ్ కంపెనీలను నగరానికి కేంద్ర ఎన్నికల సంఘం పంపించిందని తెలిపారు. వారితో ప్రధానంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడమే కాకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తామున్నామని ఒక భరోసా కల్పించేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ చేసినట్లు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతయుతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ ఎస్.విజయకుమార్, ఎస్ఐ.వెంకటరావు, సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టి కృషి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు బాపూజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం వార్డు బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, స్టాండింగ్ కమిటీ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిదర్శమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగనన్న చూసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి కార్యకర్త సమష్టి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో 54వ వార్డు కార్పొరేటర్ రజిని, 50వ వార్డు కార్పొరేటర్ వి.ప్రసాద్, వార్డు అధ్యక్షుడు ఈశ్వరరావు, వార్డు నాయకులు నీలి రవి, వెంకటేష్, బాలకృష్ణ, కృష్ణారావు, అమర్‌రెడ్డి, చిరంజీవి, శైలేష్, సంతోష్, దిలీప్, ఎం.శంకర్, రాంబాబు, రవణమ్మ, అచ్యుతరావు, రమేష్, పారన్న, హనుమంతురావు, మోహన్‌రావు, ఎల్లాజి, శ్రీను, హరినాథ్, ప్రకాష్‌రెడ్డి, దంతు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సభకు రేవంత్‌రెడ్డి

సీతంపేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 16న స్టీల్‌ప్లాంట్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఆ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్‌రెడ్డి అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నట్టు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఏపీలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు 1,350 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజులు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, మూల వెంకటరావు, ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన



ఆరోగ్య సూచనలిస్తున్న డాక్టర్ మన్‌మోహన్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండో రోజు గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 308 మంది రోగులు ఉచిత వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మన్‌మోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏడు రకాల టెస్టులు ఉచితంగా చేస్తున్నామని, 172 రకాల మందులు అందిస్తున్నామని తెలిపారు. రోగులకు వైద్య, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురికి ఆప్తాల్మిక్ అనిత కంటి వైద్య పరీక్షలు చేశారు. వరల్డ్ టీబీ డే సందర్భంగా కఫం పరీక్షలు నిర్వహించారు.

వసతి గృహం బాలికలకు అవగాహన



వసతి గృహం బాలికలకు సూచనలిస్తున్న జోన్-2 డీసీపీ సత్తిబాబు

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని గురువారం జోన్-2 డీసీపీ సత్తిబాబు సందర్శించి, పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 104 మంది బాలికలతో ఆయన ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీవితంలో స్థిరపడాలన్నా, ఉన్నత స్థాయికి చేరాలన్నా బాగా చదువుకోవాలని, క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. బాలికలకు ఎటువంటి ఇబ్బందులున్నా తెలియ పరచాలన్నారు. కాలేజీలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఆర్ అండ్ బీ కార్యాలయ ప్రహరీ కూల్చివేత

సీతమ్మధార: రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ పక్కనే ఉన్న రెవెన్యూ క్వార్టర్స్‌తోపాటు ఆర్ అండ్ బీ ఎస్ఈ కార్యాలయ ప్రహరీ, గేట్లను గురువారం పొక్లెయిన్‌తో జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. రోడ్డు పక్కనే ఉన్న చెట్లు తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రాంతంలో 80 అడుగుల రహదారిగా విస్తరిస్తున్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు

సీతమ్మధార: పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్‌లో 9వ తరగతి సెక్షన్-3లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వెంకటేశ్వరావు రూ.5 వేల నగదు అందజేశారు. ఉన్నత చదువులు చదువుకోవాలని, తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని ఆయన ఆకాంక్షించారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తూ సత్యసాయి సేవ సమితి సభ్యులు విద్యార్థులకు పెన్నులు, విభూది, ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రాంప్రసాద్, సమితి భక్తులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా బీజేపీ సభ

మద్దిపాలెం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 50వ వార్డులో బీజేపీ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్‌రాజు నిర్వహించిన సభ తూతూ మంత్రంగా సాగింది. గురువారం సాయంత్రం 6 గంటలకు జరగాల్సిన సభ గంటన్నర లేటుగా మొదలైంది. ఈ సభకు టీడీపీకి గానీ, జనసేనకు గానీ ఎటువంటి కబురు లేదని అక్కడి వర్గాల్లో చర్చించుకున్నారు. కొంతమంది టీడీపీ నాయకులు పార్టీ మీద అభిమానంతో అక్కడకు వచ్చామన్నారు. ఎక్కడా పొత్తు కనిపించడం లేదని, అంతా మాటలవరకే అని పలువురు అన్నారు. సభకు కొందరు స్థానికులు మాత్రమే వచ్చారని, చుట్టుపక్కల నుంచి ఎవరూ సభకు రావడానికి ఇష్టపడలేదని తెలిసింది.

24వ వార్డులో బీజేపీ కార్యాలయం ఏర్పాటు


సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి కార్యాలయాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మలత, బీజేపీ వార్డు అధ్యక్షుడు చిల్లా నానిరెడ్డి, దేముడు బాబు, శ్రీనివాస్‌రెడ్డి, బోర శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

బర్మా కాలనీకి మహర్దశ

- బర్మా కాందిశీకుల ఇళ్లకు మరమ్మతులు
- 600 కుటుంబాలకు మేలు
- సీఎం వైఎస్ జగన్‌కు నెహ్రూనగర్, అజయ్‌కల్లంనగర్‌వాసుల కృతజ్ఞతలు



నాడు: బర్మా కాలనీలో పెచ్చులూడిపోయి, పెయింటింగ్స్ లేక ఇళ్ల పరిస్థితి



నేడు: పెయింటింగ్స్ వేసి ఆధునికీకరించి ఇళ్లు



నాడు: ఇంటిపైన శిథిలమైన శ్లాబ్



నేడు: ఎకో ప్రూఫింగ్‌తో నిర్మించిన శ్లాబ్

మద్దిపాలెం: జీవీఎంసీ 49వ వార్డులోని బర్మా కాలనీకి ఎంతో చరిత్ర ఉంది. చాలా ఏళ్ల కిందట బర్మాలో యుద్ధం కారణంగా నాటి భారత ప్రభుత్వం బర్మా కాందిశీకుల కుటుంబాలను విశాఖకు తరలించింది. వారిలో 600 కుటుంబాలు 49వ వార్డు బర్మా కాలనీలో ప్రస్తుతం నివసిస్తున్నాయి. వారి నివాసాలు ఎలా ఉన్నాయి, వారు ఎలా జీవిస్తున్నారు అని అడిగే నాథుడే నాడు కరువయ్యాడు. వైఎస్సార్ హయాంలో అప్పటి ఎమ్మెల్యేలు ఈ ప్రాంతంలో పర్యటించి రోడ్లు నిర్మింపజేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక బర్మా కాలనీకి మహర్దశ పట్టింది. 49వ వార్డుకు కార్పొరేటర్‌గా ఎన్నికైన అల్లు శంకరరావు బర్మా కాలనీవాసుల అవస్థలను తెలుసుకున్నారు. వారి సమస్యలను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ వి.విజయసాయిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బర్మా కాలనీకి మంచిరోజులొచ్చాయి. ఈ కాలనీలోని నెహ్రూనగర్‌లో 450, అజయ్‌కల్లం నగర్‌లో 150 ఇళ్లు ఉన్నాయి. దాదాపు 46 బిల్డింగుల్లో 600 మందికి పైగా బర్మా కాందిశీకుల కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. వీరి గృహాలు గతంలో దౌర్భాగ్యకరమైన స్థితిలో ఉండేవి. ఇంటి వరండాల పెచ్చులు పడిపోయి, మెట్లు శిథిలమై, వర్షం పడిందంటే ఏ శ్లాబ్ పడిపోతుందోనన్న భయంతో నివాసులు జీవించేవారు. వీరు ఎన్ని వినతులు ఇచ్చినా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదు.

రూ.కోటితో ఆధునికీకరణ..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బర్మా కాలనీ వాసుల సమస్యలను తెలుసుకుని, ప్రతి కుటుంబానికి భరోసా ఇచ్చింది. విజయసాయిరెడ్డి, కె.కె.రాజుల దృష్టికి అల్లు శంకరరావు వీరి సమస్యలను తీసుకెళ్లడంతో వారు బర్మా కాందిశీకుల నివాస ప్రాంతాలను పరిశీలించి వెనువెంటనే జీవీఎంసీ అధికారులతో చర్చించారు. వారు స్పందించి బర్మా కాలనీ ఇళ్ల మరమ్మతులకు గానూ సుమారు కోటి రూపాయలు మంజూరు చేశారు. ఈ వ్యయంతో ఇళ్ల బయట గోడలకు పెయింటింగ్, ఇంటి మెట్లకు, శ్లాబ్‌లకు మరమ్మతులు చేశారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా, ఇంటి లోపల శ్లాబ్‌లకు చెమ్మ పట్టకుండా కారిడార్, బాల్కనీల్లో పెచ్చులూడిపోయి పడిపోతున్న శ్లాబ్‌లను ఎకో ప్రూఫింగ్‌తో నిర్మించారు. ప్రభుత్వ చర్యలతో 600 కుటుంబాలకు మేలు జరిగింది. జీవీఎంసీ చేపట్టిన పనులపై బర్మా కాందిశీకులు హర్షం వ్యక్తం చేశారు. మా కాలనీ అభివృద్ధితోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందుతున్నాయని ఆనందంగా చెబుతున్నారు. మా ఇళ్లను బాగుచేసి, మా పిల్లలు చదువుకోవడానికి చక్కని పాఠశాలలు కట్టించారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బర్మా కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

40 ఏళ్ల సమస్యను పరిష్కరించాం



అభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం. వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, కె.కె.రాజుల చొరవతో వార్డు అభివృద్ధి శరవేగంగా జరిగింది. 40 ఏళ్లుగా బర్మా కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పరిష్కారం చూపించాం. అర్హత ఉన్న అన్ని పథకాలు బర్మా కాందిశీకులకు అందుతున్నాయి. వారి పిల్లలు కూడా చదువుకుంటున్నారు.

– అల్లు శంకరరావు, కార్పొరేటర్, 49వ వార్డు

నాయకుల చొరవతో ఇళ్లకు మరమ్మతులు



సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ అల్లు శంకరరావులు ప్రత్యేక శ్రద్ధ చూపి త్వరితగతిన మా ఇళ్లకు మరమ్మతులు చేయించారు. మా కాలనీలో ఉన్న 600కు పైగా కుటుంబాలకు మేలు జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేమంతా రుణపడి ఉంటాం. ప్రభుత్వం చొరవ చూపి తాతలు, తండ్రుల ఇళ్ల పేపర్లు వారి పిల్లల పేర్ల మీదకు మారిస్తే బాగుంటుంది.

– ఆర్.చిన్నారావు, బర్మా కాలనీ

కేంద్ర ప్రభుత్వ పాలనలో రైతులకు అన్యాయం

సీతంపేట: రైతుల ఛలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా సెంట్రల్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సీఐటీయూ అక్కయ్యపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సంగం ఆఫీస్ కూడలిలో నిరసన చేపట్టారు. జోన్ కార్యదర్శి ప్రకాశరావు మాట్లాడుతూ దేశం నా కుటుంబం అంటున్న ప్రధాని మోదీ దేశానికి అన్నంపెట్టే రైతన్నను నిండా ముంచుతున్నారని విమర్శించారు. వ్యవసాయంలో స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలన్నారు. ఓట్ల కోసమే రైతులు అన్నట్టు కేంద్ర ప్రభుత్వ వైఖరి ఉందని, బీజేపీని ఇక ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. నాయకులు అప్పారావు, రాజు, కార్మికులు పాల్గొన్నారు.